క్లుప్తంగా

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించండి

• ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత


కేజీబీవీలో భోజన నాణ్యతపై ఆరా తీస్తున్న ఆర్డీఓ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరాపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం స్టోర్ రూం, కిచెన్, విద్యార్థినుల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శుభకుమార్, ఎంపీడీఓ సాలమాన్, కేజీబీవీ ఎస్‌ఓ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పిద్దాం

బొమ్మనహాళ్: మండలంలోని గ్రామాల్లో ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ సుబ్బరాజు, ఎంఈఓ-2 హరికృష్ణ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీలు, ఐఈఆర్‌పీలకు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ అధికారులు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, కేజీబీవీ ఎస్‌ఓ నాగరత్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధుల కట్టడి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

రాయదుర్గంటౌన్: ముందు జాగ్రత్త చర్యలతోనే సీజనల్ వ్యాధులను కట్టడి చేయొచ్చని జిల్లా గణాంక అధికారి మహమ్మద్ రఫీ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులతో పాటు వైద్య సిబ్బంది ర్యాలీలో హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ వ్యాధులు చాలా ప్రమాదకరం అన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇవి దోమకాటు వల్ల వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఓ లక్ష్మీ, నరసమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

కూడేరు: రైతులు క్రాప్ లోన్లను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవి కుమార్ తెలిపారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరాకి రూ.45 వేల వరకు రుణం ఇస్తామన్నారు. రుణం కావాల్సిన రైతులు బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్‌లు, కంప్యూటర్ అడంగల్, రెండు పాస్ ఫొటోలు , జామీనుదారులను పిలుచుకొని బ్యాంకుకు రావాలన్నారు. బంగారంపైనా వ్యవసాయ పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా రుణాలు ఇస్తున్నామన్నారు. తులానికి రూ.45 వేల వరకు రుణం ఇస్తామన్నారు.

'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలి


నిరసన ర్యాలీ చేస్తున్న ఇంటర్ విద్యార్థినులు

ఉరవకొండ: ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ చేశారు. ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు భీమేష్, చిరంజీవి, అనిల్ మాట్లాడారు. ఉరవకొండ ఇంటర్ బాలుర, బాలికల కళాశాలలో దాదాపు 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. దాదాపు 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలలకు వస్తుంటారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు మధ్యాహ్న భోజనం తినకుండా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. అనంతరం ఆర్‌ఐ రామకృష్ణకు వినతి పత్రం అందించారు.

అక్రమాలు 'రియల్' .. చర్యలు నిల్

• పంట పొలాలను ప్లాట్లుగా మార్చేస్తున్న వైనం
• మాయమాటలు చెప్పి అనధికార లేఔట్లలో ప్లాట్ల విక్రయాలు
• నిలువునా మోసపోతున్న సామాన్యులు
• ఎన్‌ఓసీలు లేకుండానే విక్రయాలు

అనంతపురం- రాయదుర్గం, కణేకల్లు- రాయదుర్గం, బళ్లారి- రాయదుర్గం, బీటీపీ-రాయదుర్గం ప్రధాన రహదారుల్లో పుట్టగొడుగుల్లా రియల్ వెంచర్లు వెలిశాయి. ఈ రహదారుల్లో బైపాస్, రింగు రోడ్లు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎంతో విలువైన స్థలాలుగా మారుతాయి..పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఇది అద్భుత అవకాశం..అని రియల్టర్లు, వారి బ్రోకర్లు చేస్తున్న ప్రచారం చేస్తున్నారు. కాసులే పరమవాధిగా కొందరు మాటల గారడీతో సామాన్య, మధ్య తరగతి ప్రజలను నిలువునా ముంచుతున్నారు. అదిగదిగో.. ఆ లేఔట్ మీ భవితకు పెన్నిధి అంటూ అరచేతిలో వైకుంఠం చూపుతున్నారు. పంట పొలాల్ని ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు కిమ్మనడం లేదు.

– రాయదుర్గం:


రాయదుర్గం పట్టణ శివారులో వెలసిన వెంచర్

రాయదుర్గం పట్టణ, మండల కేంద్రాల్లో సుమారు 100కు పైగా అనధికార లేఔట్లు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన పలు మండలాల్లోనూ పంచాయతీల అనుమతి లేకుండానే అక్రమంగా వెంచర్లు వెలిశాయి. మామూళ్లు తీసుకొని అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

రాయదుర్గం పట్టణం, మండల కేంద్రాల పరిసర గ్రామాల్లో వ్యవసాయ భూములకు రెవెన్యూశాఖ పన్ను చెల్లించకుండానే వ్యవసాయేతర భూములుగా మార్చుకుంటున్నారు. వీటికి ఆయా పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే వెంచర్లు వేసి, ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. అనుమతులు తీసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని కావడంతో అధికారులను ప్రసన్నం చేసుకొని పని చక్కబెట్టేస్తున్నారు. పట్టణాలకు సమీపంలో అంటూ పది కిలోమీటర్ల దూరంలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు వెళ్లి ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు అనధికార లేఔటు ప్రాంతాల్లో అనుమతి లేదని బోర్డులు పెడుతున్నారు. దీని వల్ల సామన్య ప్రజలకు అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి ఉంటుంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..?

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల నిమిత్తం పన్ను చెల్లించాలి. లేఔట్‌కు సంబంధించి ప్రతిపాదనలు ఇస్తే పంచాయతీ తీర్మానం చేసి తాత్కాలిక సాంకేతిక అనుమతులు కోసం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)కి పంపిస్తారు. తాత్కాలిక సాంకేతిక అనుమతులు వచ్చిన తర్వాత మురుగు కాలువలు, రహదారులు, అంతర్గత రహదారులు, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యంతో పాటు 10 శాతం భూమిని సామాజిక అవసరాల కోసం సంబంధిత పంచాయతీకి రిజిష్టర్ చేయాలి. నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేసిన తర్వాత తుది ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపాలి. ప్లానింగ్ అనుమతుల మేరకు నంబర్లు కేటాయించాల్సి ఉన్నా.. ఈ విధానం ఎక్కడా కనిపించలేదు.

అనుమతి లేనివి కొంటే నష్టమే..

సంబంధిత గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీకి స్థలం రిజిస్ట్రేషన్ విలువలో 14 శాతం సొమ్ము చెల్లించాలి. బెటర్‌మెంట్ చార్జీలు, ఇతర చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. పన్నులు, జరిమానాలు, చెల్లించిన తర్వాతే ఇంటి నిర్మాణానికి అధికారులు అనుమతులు ఇస్తారు. ఇంటి ప్లాన్ ఉంటే తప్ప మిగిలిన అనుమతులు రావు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఎల్‌పీ నంబరు ఉన్న వెంచర్లలోనే కొనుగోలు చేయాలి.

రియల్ వ్యాపారులు చేస్తున్న ప్రచారం ఇదీ..

▸▸ భంభంస్వామి ఆలయం చెంతనే అహ్లాదకరమైన వాతావరణం. కాలుష్యానికి పూర్తి దూరం. అనంతపురం- రాయదుర్గం ప్రధాన రహదారి నుంచి నిమిషాల వ్యవధిలోనే ప్లాట్‌కు చేరుకోవచ్చు.. ఇలాంటి స్థలాలు ఎక్కడా లేవు.. ఎలాంటి అనుమతులు లేకుండా లేఔట్ వేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న ప్రచారం ఇదీ..

▸▸ ఓ వైద్యశాఖ ఉద్యోగి ఒకరు ప్లాట్ల గురించి వాకబు చేసి అవాక్కయ్యారు. బ్రోచర్‌లో చూపించినదానికి, వాస్తవానికి ఎంత తేడా ఉందని నిట్టూర్చారు. అన్ని అనుమతులు, ఇతరాత్రా అంశాలు పరిశీలించకుండానే స్నేహితులు చెప్పారని, ఏజెంట్లు సూచించారని కొనుగోలు చేస్తున్నారు. వీటిని అమ్ముకోవాలన్నా.. ఇల్లు కట్టుకోవాలని ప్లాన్‌కు వెళ్లినా అనుమతులు లేని విషయం తెలిసి పన్నుల భారం మోయలేక సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

అనుమతి లేని వాటిపై చర్యలు



అనుమతులు లేని లేఔట్లపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు లేఔట్‌లు గుర్తించి సిబ్బంది రాళ్లు తొలగించారు. రియల్టర్లకు హెచ్చరికలు జారీ చేశారు. అనుమతులు ఉన్న లేఔట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలి. క్షేత్రస్థాయిలో మరోమారు పరిశీలిస్తాం. అక్రమం అని తేలితే రాళ్లు తొలగించి, స్థలాల విక్రయాలను అడ్డుకుంటాం.
– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని ప్రజలే గుర్తిస్తారు

• సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలే గుర్తిస్తారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీల సహకారంతో అధికారంలోకొచ్చిన టీడీపీపై నాయకులే తిరుగుబాటు చేసే పరిస్థితి తప్పక వస్తుందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను నమ్మించి అధికారంలోకొచ్చారని అన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ మంచిని గుర్తిస్తారన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తన వద్దకు రావాలన్నారు. ప్రజల పక్షాన పోరాడాల్సింది మనమేనని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు రేవన్న గౌడ్, గణేష్, మల్లికార్జున, గోళ్ల సూరి, హనుమంతరెడ్డి, ఎల్‌ఐసీ మురళి, కిరీటి, భీమేష్, గంగాధర్, చరణ్, నారాయణ స్వామి, పలువురు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన ర్యాలీ


నెరిమెట్లలో కీటక జనిత వ్యాధులపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల, రాయంపల్లి గ్రామాల్లో కీటక జనిత వ్యాధులపై శనివారం అవగాహన ర్యాలీ చేశారు. రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ మాట్లాడారు. కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు నీరు నిల్వ ప్రాంతాల్లో వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, వెంకటేష్, సీఓ భగవాన్ దాస్, ఏఎన్‌ఎం సలీమా, లలిత పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ


ఉరవకొండ ఎస్సీ వసతి గృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ మందు శనివారం పిచికారీ చేయించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిడ్డి ఆధ్వర్యంలో వసతి గృహ అధికారుల సమక్షంలో పారిశుధ్య సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారు. హాస్టల్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చెల్లించి, మురికినీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయించారు.

జై భీం సంరక్షణ సమితి లీగల్ అడ్వైజర్‌గా అలెగ్జాండర్

కళ్యాణదుర్గం: జై భీం సంరక్షణ సమితి లీగల్ అడ్వైజర్‌గా ఆర్‌కే అలెగ్జాండర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జై భీం సంరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విలియమ్స్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తన ఎన్నికకు సహకరించిన హైకోర్టు న్యాయవాదులు డేనియల్, మల్లేశ్ యాదవ్, ఆంటోనీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: మథనం కవితా సంపుటితో ఎంతో మందిని ఆకట్టుకున్న సీనియర్ కవి మధురశ్రీ కలం నుంచి మరో కవితా ఝరి జాలు వారింది. సరోజ గోవిందం సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడిగా మధురశ్రీ అనేక ఏళ్లగా సాహితీ సేవలందిస్తున్నారు. వివిధ సాహితీ సంస్థలలో బాధ్యత లున్న మధురశ్రీ తన సాహిత్య సేవా ప్రస్తానంలో అనేక అవార్డులందుకున్నారు. ఆ కోణంలోనే సామాజిక సమస్యలపై నిశిత దృష్టితో సాగిన 'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటిని ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్జీఓ హోంలో ఆవిష్కరించనున్నారు. జిల్లాలోని ప్రముఖ కవులు, రచయితలు విచ్చేస్తున్నారని జిరసం అధ్యక్షుడు జన్నె ఆనంద్ తెలిపారు.

పండుగలా ఏరువాక పౌర్ణమి


వడ్రహొన్నూరులో ఎద్దుల పరుగు పందేన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఏరువాక పౌర్ణమి అనంతరం రైతులు సేద్యం పనులను ముమ్మరం చేసి, విత్తన సాగుకు సన్నద్ధమవుతారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దులు ఉన్న రైతులు ఎద్దుకొమ్ములకు రంగులు పూసి, అలంకరణ చేసి పూజలు చేయడం ఆనవాయితీ. ఏరువాక పౌర్ణమిని మండలంలోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించగా, వడ్రహొన్నూరు, టి.వీరాపురం తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ గ్రామాల్లో ముస్తాబు చేసిన ఎద్దులను పరుగు పందెం నిర్వహించి, గెలిచిన ఎద్దులను గ్రామాల్లో ఊరేగించి, సంబరాలు జరుపుకున్నారు.

సీతారామస్వామి ఆలయంలో విశేష పూజలు


వజ్రకరూరులో అలంకరణలో సీతారామస్వామి


అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు:స్థానిక బలిజ వీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వజ్రకరూరులోని జనార్దనవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

సమయపాలన పాటించాలి

కూడేరు: సమయపాలన పాటిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి సూచించారు. శనివారం ఆమె కూడేరులోని అంగన్‌వాడీ కేంద్రం-3ని తనిఖీ చేశారు. పిల్లల హాజరు, కేంద్రానికి వచ్చే గర్భిణుల రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్త కళావతికి సూచించారు.

గుండె పోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


గోవింద్ నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం : మండలంలోని బొమ్మగానపల్లి వంక తండాకు చెందిన రేశం గోవింద్‌నాయక్ (60) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్‌నాయక్ , సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి తదితరులు బొమ్మగానపల్లి వంక తండాకు వెళ్లి గోవింద్‌నాయక్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలి

ఉరవకొండ: పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉరవకొండ ఎంఈఓ-2 రమాదేవికి శనివారం వినతిపత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు హరూన్ రషీద్ మాట్లాడుతూ ఉరవకొండలో ది ఎడిషన్ స్కూల్‌కు అనుమతి లేకపోయినా యాజమాన్యం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సురేష్, సాయి, మారుతి, అఖిల్‌లు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం ఎర్రితాతస్వామి

• నేటి నుంచి 88వ ఆరాధనోత్సవాలు


జీవసమాధిపై కొలువుదీరిన అవధూత ఎర్రితాతస్వామి మూలవిరాట్

బొమ్మనహాళ్: భక్తుల కొంగుబంగారంగా అవధూత సద్గురువు ఎర్రితాతస్వామి వెలుగొందుతున్నాడు. ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ కర్ణాటక నుంచి బొమ్మనహాళ్‌కు చేరుకున్న ఎర్రితాతస్వామి ఎన్నో మహిమలు చూపారు. శాంతిధామంలోనే తన భక్తుల సమక్షంలో 1936లో జీవసమాధి పొందారు. ఎర్రితాతస్వామిని పూజిస్తే వంశ వృద్ధి జరుగుతుందని, రోగాలు నయమవుతాయని, కష్టాలు దరిచేరవని భక్తుల విశ్వాసం. ఎర్రితాత 88వ ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. నేడు నాందీపూజ, గణపతి పూజ, గోపూజ, కలశస్థాపన, గంగపూజ, ధ్వజారోహణ, స్వస్తిపుణ్యాహవాచకం, రాత్రికి నంది వాహన సేవ పూజలు కొనసాగుతాయి. సోమవారం మహా గణపతి పూజ, సహస్రమూలికా పంచామృతాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, సాయంత్రం శేషతల్ప అలంకరణలు, మంగళవాయిద్యాలు, భజనల నడుమ రాత్రి 10 గంటల నుంచి పురవీధులగుండా వైభవోపేతంగా స్వామివారి ప్రభోత్సవ ఊరేగింపు నిర్వహిస్తారు. మంగళవారం అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, ఛత్రప్రభ అలంకారం, ఉట్లపరుష, రాత్రికి భజనలు, కోలాట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ లలిత తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు.

సివిల్ సప్లయీస్ గోదాము తనిఖీ

కణేకల్లు: కణేకల్లులోని సివిల్ సప్లయీస్ గోదామును గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక ధాన్యపు డిపోలకు సరఫరా చేసే చక్కెర ప్యాకెట్లను ఆయన తూకం వేసి, పరిశీలించారు. కొన్ని ప్యాకెట్లలో అర కిలోకి 20 నుంచి 30 గ్రాములు తక్కువ ఉన్నట్లు ఆయన గుర్తించారు.

విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు శనివారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన పింజారి వన్నూరుసాబ్‌కు చెందిన రెండు గేదెలు మేత కోసం ప్రభుత్వ పాఠశాల వెనుక వైపు వెళ్లాయి. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద విద్యుత్ తీగలు తగిలి, రెండు గేదెలు మృతిచెందాయి. దీంతో రూ.1.10 లక్ష నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వరంలో వేదమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలాన్ని తీసుకొచ్చి, అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు.

శనీశ్వరస్వామికి ...


ప్రత్యేక పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామి శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడికి ...


అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

ఉరవకొండ: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, నెలపూజలు చేశారు. ఉదయం స్వామికి పుష్పాలతో అలంకరించి, అభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చన చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని పల్లకీలో ఉంచి ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలాజీస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బసాపురం అంజన్నకు పూజలు


అలంకరణలో బసాపురం అంజన్న

కూడేరు: మండల కేంద్రం సమీపంలోని బసాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకుడు దుర్గ చైతన్య ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆంజనేయుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

'శ్రేష్ట'కు దుర్గం విద్యార్థిని ఎంపిక


హాసినిశ్రీ, విద్యార్థిని

కళ్యాణదుర్గం: దేశ వ్యాప్తంగా కేంద్రం నిర్వహించే శ్రేష్ట పాఠశాలలో ప్రవేశానికి (స్కీం ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హై స్కూల్స్) కళ్యాణదుర్గం విద్యార్థిని హాసిని ఎంపికైంది. శ్రేష్ట ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో కళ్యాణదుర్గం పట్టణం లిటిల్ రోజెస్ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని మందల హాసినిశ్రీ శ్రేష్ట పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. 400 మార్కులకు గానూ 184 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 918 ర్యాంకు సాధించింది. దీంతో తల్లిదండ్రులు రవి, భారతి సంతోషం వ్యక్తం చేశారు.